క్లుప్తంగా

చిరుధాన్యాల్లో పోషకాలు

• సీడీపీఓ సరిత



వర్గల్ పోషణ సంబురాల్లో పాల్గొన్న సరిత

వర్గల్(గజ్వేల్)/గజ్వేల్‌రూరల్: అపార పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను తల్లులు, గర్భిణులు, బాలింతలు తమ ఆహారంలో తప్పకుండా తీసుకోవాలని సీడీపీఓ సరిత సూచించారు. మండలంలోని వర్గల్, నాచారంలో బుధవారం నిర్వహించిన సెక్టార్ లెవెల్ పోషణ సంబురాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు ఎత్తుకు తగిన బరువుండాలని, తక్కువ బరువు కలిగిన పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. వర్గల్ వైద్యాధికారిణి డాక్టర్ హరిత, ఎంపీడీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు రాణి, సునీత, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన పోషణమాసం వారోత్సవాల్లో సరిత మాట్లాడుతూ తల్లులు పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ శ్రీలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు శోభ, విజయ, చంద్రకళ, శిరీష పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అన్నదానం



అన్నదానం చేస్తున్న మహిళలు

హుస్నాబాద్: పట్టణంలోని అక్కన్నపేట చౌరస్తాలో వాసవి మాత అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలు ప్రతి నెలా తమ ఇంటి నుంచి బియ్యం సేకరించి పౌర్ణమి రోజున అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వంట నూనెల ధరలు తగ్గించండి



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పండుగల సమయంలో వంట నూనెల ధరలు పెంచడం పేద ప్రజలను దోపిడీ చేయడమేనని బీఎస్పీ నాయకులు ఆరోపించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పలువురు నేతలు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తున్నామని, పేదరికం నిర్మూలిస్తున్నామని మోదీ చెబుతున్నా నిత్యావసర వస్తువులు, డీజిల్, పెట్రోల్ ధరలు ఆకాశనంటాయన్నారు. వెంటనే వంట నూనెల ధరలను తగ్గించి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ గౌడ్, నాయకులు సుధాకర్, వెంకటేష్, శంకర్, రాజు పాల్గొన్నారు.

గుట్టను తోడేస్తున్నారు..

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లిశివారులోని సర్వే నెంబర్ 139లో సుమారుగా 39ఎకరాల పంచరాయి భూమిని కొంతమంది కబ్జాచేసి సాగుచేస్తున్నారని ఆర్డీఓ రామ్మూర్తికి గ్రామస్తులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు గుట్టను తోడేస్తున్నారని, అక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కరువవైందని ఆరోపించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని లేకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నరేశ్, వీరాచారి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రామక్కపేట ఆస్పత్రి తనిఖీ

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి ఆనంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి అన్ని రకాల పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోగులపై దురుసుగా ప్రవర్తించవద్దని, సమయపాలన పాటించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న ఆనంద్

వంతుల వారీగా విధులు



విధుల్లో ఉన్న అధికారి

ఇరిగేషన్ ఇంజనీర్ల నిర్వాకం

• పట్టించుకోని అధికారులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఇరిగేషన్ డివిజనల్ కార్యాలయానికి నాలుగు సబ్ డివిజన్లు ఉన్నాయి. వాటి కార్యాలయాలు మండల పరిషత్ సముదాయంలోని ఐబీ గెస్టు హౌజ్‌లో ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ నలుగురు డీఈఈలు, ఏఈలు ఉన్నారు. అయితే వారు నిత్యం ఫీల్డు విజిట్ పేరుతో కార్యాలయాలకు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బుధవారం నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు అటెండర్లు ఉండాల్సి ఉండగా..కేవలం ఒకరే విధులకు హాజరయ్యారు. ఉన్నతాధికారులను మేనేజ్ చేసుకొని ఒకరు ఆఫీసుకు కాపలా ఉండి మిగితావారు విధులకు డుమ్మా కొడుతూ సొంత పనులు చేసుకుంటున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రజిత

తడిచెత్తతో ఎరువు తయారీ : రజిత

హుస్నాబాద్: ఇంటి నుంచి వచ్చే తడి చెత్తతో ఎరువును తయారు చేసుకొని మొక్కలకు వాడుకోవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత చెప్పారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డీఆర్‌సీసీ కేంద్రం వద్ద చెత్త ప్రాసెసింగ్ విధానంపై వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి వద్ద వేరుచేసి ఇచ్చిన చెత్తలో పొడి చెత్తను డీఆర్‌సీసీ కేంద్రం వద్దకు తీసుకువచ్చి రీసైక్లింగ్ చేసుకోవచ్చన్నారు. తడి చెత్తను కంపోస్ట్ షెడ్డుకు తెచ్చి ఎరువుగా తయారు చేసుకొని మొక్కలకు వాడుకోవచ్చని తెలిపారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు కొంకట నళినిదేవి, హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావద్దు

అన్ని మండలాల్లోను పోలీసు అధికారులు సైబర్ నేరాలు, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హైస్కూళ్లు, కళాశాలల్లో బుధవారం ఆయా పోలీస్ స్టేషన్ల సీఐ, ఎస్‌ఐలు పాల్గొని మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత ఎక్కువ శాతం సెల్ ఫోన్లకు, మత్తు పదార్థాలకు అలవాటు పడుతూ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రభావాలకులోనై ఇబ్బందులకు గురికావద్దని కోరారు. అసాంఘిక కార్యక్రమాలు, డ్రగ్స్, గంజాయి తదితర మత్తుపదార్థాల వినియోగాలకు దూరంగా ఉండాలని వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



కొండపాక(గజ్వేల్): దుద్దెడ హైస్కూల్లో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్



హుస్నాబాద్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ



గజ్వేల్‌రూరల్: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ ముత్యంరాజు తదితరులు



అక్కన్నపేట(హుస్నాబాద్): అంతక్కపేట పాఠశాలలో ఎస్‌ఐ విజయ్‌భాస్కర్



దుబ్బాకటౌన్: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గంగరాజు



కొమురవెల్లి(సిద్దిపేట): మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజుగౌడ్

దర్జాగా భగీరథ నీళ్ల మళ్లింపు

• రైతుపై తండావాసుల ఫిర్యాదు
• పైపులైన్లను తొలగించిన అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ రైతు ఏకంగా భగీరథ నీళ్లను పైపులైన్ ద్వారా తన పంట పొలాలకు మళ్లించాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం చాపగానీతండాలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి స్వరూప తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పరిధిలోని తెల్లపలుగుతండాకు కొన్నిరోజులుగా మిషన్ భగీరథ తాగునీరు రావడం లేదు. దీంతో తండావాసులు అధికారులకు తెలియజేశారు. వారు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. తండాకు చెందిన ఓ రైతు వాటర్ ట్యాంక్‌కు ఎక్కించే పైపులైన్ వద్ద గేట్‌వాల్ బిగించుకొని పైపుల ద్వారా వరి పొలాలనికి నీరు మళ్లిస్తున్నాడు. అది గమనించిన తండావాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఎంపీడీఓ భానోతు జయరాం, మిషన్ భగీరథ ఏఈ సాయికృష్ణ ఆధ్వర్యంలో రైతు వేసిన పైపులైన్లను జేసీబీ ద్వారా తొలగించారు. మరలా ఇలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అధికారులు ఆ రైతును మందలించి వదిలేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ సిబ్బంది, తండావాసులు పాల్గొన్నారు.



పైపులైన్‌ను తొలగిస్తున్న అధికారులు

రెండు వర్గాలపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్): మూడు గుంటల భూ వివాదంలో రెండు వర్గాలపై కేసు నమోదైంది. మండలంలోని కట్కూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లి రవి, జల్లక సంపత్‌ల మధ్య బుధవారం మూడు గుంటల విషయంలో గొడవ జరిగింది. రెండు కుటుంబాల సభ్యులు గొడవ పడి పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఐదుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.9వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి

కొండపాక(గజ్వేల్): పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతలతో ఆరోగ్యంగా ఉంటామని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి పేర్కొన్నారు. కొండపాక మండలంలోని దుద్దెడలోని బాలుర గురుకుల పాఠశాలలో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమం నిర్వహణలో భాగంగా బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేవకీదేవి మాట్లాడుతూ పాఠశాలల్లో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతలు పాటించేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ విష్ణు, ప్రిన్సిపాల్ నర్సింహాచారి, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి పాల్గొన్నారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశం

చేర్యాల(సిద్దిపేట): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపైన చర్చించిన సభ్యులు వాటిని ఆమోదిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు కమిషనర్ నాగేందర్ తెలిపారు. ప్రజల అవసరాల మేరకు ట్రాక్టర్‌కు డోజర్ బ్లేడ్ ఫిట్ చేయించడం, 12వార్డుల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేయడానికి బాసిల్ ఏజెన్సీకి అగ్రిమెంట్ చేయడం, జంతువధశాల ఏర్పాటు, రోడ్లపై బోర్డుల ఏర్పాటు, పట్టణ పరిశుభ్రత, త్వరలో జరగనున్న బతుకమ్మ పండుగ ఏర్పాట్లు వంటి అంశాలపై చర్చించి తీర్మానం చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో కౌన్సిలర్లు లింగం, నరేందర్, తార, ఇన్నమ్మ, లీల, సతీశ్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్ పర్సన్ స్వరూపరాణి

రోడ్డు మరమ్మతులకు దాత సహాయం

కొండపాక(గజ్వేల్): భారీ వర్షాలకు గుంతలమయంగా మారి ప్రయాణానికి నరకంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయించి ఆదర్శంగా నిలిచారు బీఆర్‌ఎస్ నాయకుడు కన్నెమైన సంపత్. సుమారు రూ.50వేలతో కిలో మీటరు దూరం రోడ్డును ప్రయాణానికి అనుకూలంగా మార్చారు. కుకునూరుపల్లిలోని కళకళమ్మ చెరువు కట్ట మీదుగా బొబ్బాయిపల్లి నుంచి కొండపోశమ్మతల్లి దేవాలయానికి వెళ్ళే ఈ రోడ్డు వర్షాలు కురిసినప్పుడల్లా బురదమయంగా మారి ప్రయాణానికి ఆటంకంగా మారేది. పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్ళినా వారి నుంచి స్పందించడం లేదని బొబ్బాయిపల్లి గ్రామస్తులు వాపోయారు. దీంతో వారంతా సంపత్ దృష్టికి తీసుకెళ్ళారు. తన వంతుగా రూ.50వేలు భరించేందుకు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో నాయకులు మహేందర్, రెడ్డమైన రవీందర్, రాజు, మల్లయ్య, రమేష్ జేసీబీ సహాయంతో గుంతలను పూడ్చి రోడ్డును ప్రయాణానికి అనుకూలంగా మార్చుకున్నారు. దాత సంపత్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



గుంతలు పూడ్చిన గ్రామస్తులు

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

చైర్‌పర్సన్ వనిత, ఏసీపీ మధు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక: పట్టణంలో 21న జరిగే గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఏసీపీ మధు ఆదేశించారు. పట్టణంలోని పెద్ద చెరువును బుధవారం సందర్శించి నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు కట్ట వద్ద, అలాగే రోడ్లపై ఏ విధమైన చర్యలు చేపట్టాలన్న దానిపై సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అన్నిశాఖల అధికారులు, యువజన సంఘాల నాయకులు సహకరించాలన్నారు. చెరువు కట్ట వద్ద గజ ఈతగాళ్లను, లైటింగ్ తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యేంత వరకు మున్సిపల్ సిబ్బంది చెరువు వద్దనే ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, కమిషనర్ రమేష్ కుమార్, ఎస్‌ఐ గంగ రాజు, కౌన్సిలర్ బంగారయ్య తదితరులు ఉన్నారు.

వెదురుతో ఉపయోగాలెన్నో..

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటకమాన్: అనాదిగా వెదురుతో ఎన్నో వస్తువులను తయారుచేసి మనం చాలా రకాలుగా వినియోగించుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవెర్గు మంజుల రాజనర్సు, మేదర సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వెదురు బొంగుల దినోత్సవం సందర్భంగా మోడ్రన్ బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసినన వెదురు వస్తువుల స్టాల్‌ను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రాలో 10సంవత్సరాల నుంచి ప్రపంచ వెదురు బొంగుల దినోత్సవాన్ని మేదరి నాయకులు నిర్వహించడం విశేషం అన్నారు. వెదురు బొంగులపై జీవనం సాగిస్తున్న వారికి ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో రాజయ్య, చంద్రయ్య, రమేష్, రవి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంజుల

సంక్షిప్త వార్తలు

◆ మల్లన్నకు వెండి కానుకలు



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామికి రూ.85వేల విలువైన వెండి కానుకలను వరంగల్‌కు చెందిన భక్తులు కొండి శ్రీధర్ లత దంపతులు బుధవారం ఆలయ పర్యవేక్షకుడు శ్రీరాములుకు అందించారు. స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ మాజీ నేతపై చర్యలు తీసుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని రేగులపల్లె శివారులో పేదలకు పంచిన భూములను ఆక్రమించుకున్న మాజీ ప్రజాప్రతినిధిపై చర్యలు తీసుకోవాలని సామాజిక ఉద్యమకారుడు కనకం కుమారస్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కబ్జాకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఉద్యమకారులు జేరిపోతుల మధు, శానగొండ శరత్, అంకుష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ నేతలను అరెస్టు చేయండి

గజ్వేల్‌రూరల్: రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, టీపీసీసీ అధికార ప్రతిధి బండారు శ్రీకాంత్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం వారు అంబేడ్కర్ చౌరస్తా వరకు విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించి, బీజేపీ నాయకుల ఫ్లెక్సీలను దహనం చేశారు. యాదగిరి, మల్లారెడ్డి, భానుప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

◆ లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

గజ్వేల్‌రూరల్: రాజీపడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదపడుతుందని, కక్షిదారులు సత్వర న్యాయం కోసం లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల సేవాధికార సంస్థ చైర్మన్ సౌమ్య, అడిషనల్ సివిల్ జడ్జి ప్రియాంక పిలుపునిచ్చారు.

◆ దళితులపై దాడి దురదృష్టకరం

ములుగు(గజ్వేల్): ములుగు మండలం దాసర్లపల్లిలో దళితులపై జరిగిన దాడి దురదృష్ట కరమని కాంగ్రెస్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం నియమించిన త్రిసభ్య కమిటీ చైర్మన్ అచ్చుత్ రమేష్, సభ్యులు జల్పల్లి నరేందర్, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం వారు గ్రామాన్ని సందర్శించారు. దళితుల వినాయకుడి మండపాన్ని తగులబెట్టడమే కాకుండా తమతో సమానంగా దేవుడిని పెట్టుకోకూడదని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సునీల్‌మాదిగ, రోజా రాణి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ మెడికల్ విద్యార్థుల సందడి



సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సందడి నెలకొంది. వార్షికోత్సవం సందర్భంగా ఉద్భవ్ పేరుతో వైద్య విద్యార్థులు నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మెడికల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ మండలస్థాయి క్రీడలకు ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి సౌజన్యంతో నిర్వహించే మండల స్థాయి క్రీడలకు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ జోగు ప్రభుదాస్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడల నిర్వహణపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22, 23 తేదీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఈ క్రీడలకు విద్యార్థుల ఎంట్రీ ఫారాలను 21న రిజిస్ట్రేషన్ల కమిటీలకు అందజేయాలన్నారు.